4/2/96 125 123

# సుబ్బారావుని వెతుకుదాం రండి!



టివియస్

ఈ పరిస్థితుల్లోనే అతనికి ప్రమోషన్ వచ్చింది... సుపీరియారిటీ కొంతమందికి హుందాగా అమరుతుంది. కొంతమందికి వికృతంగా... అమరుతుంది.

పరాయీకరణ ...సుబ్బారావుకి ఈపదం చాలా గ్లామరస్‌గా కనిపించింది, వినిపించింది. కారణం ఏమీ లేదు. అది అంతే ఒక్కో వ్యక్తికి ఒక్కో వస్తువు, అలాగే ఒక్కో పదం ఎందుకు నచ్చుతాయో ఎందుకు నచ్చవో కారణాలు హేతుబద్ధంగా విశ్లేషించడం సాధ్యంకాదు. అది అంతే.

సుబ్బారావుకి అలాగే ఈ ఎలియనేషన్ అనే పదం నచ్చింది. యధాలాపంగా పుస్తకాలు తిరగేస్తుంటే హఠాత్తుగా అతనికాపదం కనిపించింది. చదివాడు. అప్పుడు అతనికీపదానికి అర్థం తెలియదు. కొత్తగా వింతగా అనిపించింది దాంతో తెలుసుకున్నాడు. అది చాలు సుబ్బారావుకి.

అక్కడనుంచి సుబ్బారావు జీవితంలో ఓ పెద్దమార్పు సంభవించింది. గతించిన చిన్నతనపు అనుభూతుల నుంచి అప్పటిదాకా ఎంతో ఇష్టంగా, గౌరవంతో చేస్తున్న తన ఉద్యోగం దాకా అన్నీ కొత్తగా మారిపోయాయి. రోజువారీ ప్రతి సంఘటనా అతనికి భారంగా మారిపోయింది. అంతకు ముందు తెలియని అవమానాలు అనుభవంలోకొచ్చాయి. ప్రతి పుస్తకంలోనూ ఏవో కొత్త అర్థాలు కనిపించసాగాయి. ప్రతి మాటకూ ఏవేవో కొత్త అర్థాలు వినిపించడం మొదలు పెట్టాయి.

మిత్రులంతా స్వార్థపరుల్లా కనిపించడం మొదలు పెట్టారు.

"వెధవ జీవితం కోసం రాజీపడి బతుకుతున్నాను' ' అనే బాధ ఎక్కువయిపోయింది. ఆఫీసులో ఓ గంట ఎక్కువ ఉంటే 'వెధవజీవితం' అనుకునే విరక్తి పెరిగిపోయింది. దాంతో అర్థంలేని అసహనం, అనవసరమైన అమిత్రత్వభావం మొదలయ్యింది. కొలీగ్స్‌తో సత్సంబంధాలు పోయాయి.

ఇపుడు నిజంగా 'అతని'లోని అతను వేరయిపోయాడు. ఇపుడతను సుబ్బారావుకాదు మరో 'రావు' "నాలాంటి గొప్పవాడికి సరైన గుర్తింపులేదు అనే బాధ రోజు రోజుకూ ఎక్కువైపోయింది. దాంతోపాటే నేను చాలా గొప్పవాడిని అనే భావం కూడా పెరిగిపోయింది. అంతకు ముందు సుబ్బారావు ఆరాధించే వాళ్ళంతా హఠాత్తుగా అతని దృష్టిలో అతని ముందు పిపీలికాలైపోయారు. కొత్తగా వాళ్ళ లోపాలనీ మేగ్నిఫై అయ్యి కనిపించడం మొదలు పెట్టాయి. ఇంతదాకా వాళ్ళని ఎలా గౌరవించానా? అనే చింత పెరిగిపోయింది. వాళ్ళకు ఇతను చేసిన ఒకటీ అరా సర్వీసెస్ ఇపుడు వాళ్ళ దోపిడీ స్వభావానికి చిహ్నాలుగా కనిపించసాగాయి.

ఈ పరిస్థితులలోనే అతనికి ప్రమోషన్ వచ్చింది. అది అనుకోనిదేం కాదు సీనియారిటీ ప్రకారం ఎప్పుడో రావలసినదే కానీ ఆ ప్రమోషన్ అతనికేం మేలు చేయలేదు. సుపీరియారిటీ కొంతమందికి హుందాగా అమరుతుంది. కొంతమందికి వికృతంగా అసహ్యంగా మారిపోతుంది. సుబ్బారావు పరిస్థితి అలా తయారయ్యింది.

అతని ప్రమోషన్ అతని భార్యా పిల్లలతో పాటుగా కొలీగ్స్‌ని కూడా అతనికి బానిసల్లా చూపించడం మొదలెట్టింది. అదీకారణంగాఆఫీసులో మర్యాదపోయింది. భద్రతలేదు ప్రతిక్షణం భయం, గండం. పెరిగిన హోదా అతని ఆర్థిక ప్రపంచాన్నేం మార్చలేదు. అప్పులూ, పస్తులూ షరామామూలే! అంతకు ముందు డబ్బులేకపోవడం ఒక ప్రివిలేజ్ ప్రమోషన్ తర్వాత డబ్బులేకపోవడం తప్పు. ఫాల్స్ ప్రిస్టేజ్ కోసం ఖర్చులింకా పెరిగాయి. తలకు మించిన అప్పులు పెరిగిపోయాయి.

భార్య భరించడం మానేసింది. దాంతో సుబ్బారావుకి ఇల్లూ, ఆఫీసు ఒకటే అయ్యాయి. అక్కడా, ఇక్కడా కూడా తన హోదాని గుర్తించని సబార్డినేట్స్. అన్నీ చికాకులే.

"సుందరం ఓ కాఫీ పట్రా. ఎన్నిసార్లు చెప్పాలి నీకు" అని అటెండర్ మీద అరిస్తే.

"తెస్తా సారూ, పొగరుగా. అటెండరనేంటి ఎవరూ ఎవరూ సుబ్బారావు హోదాని లక్ష్యపెట్టరు.

సుబ్బారావేం తక్కువ కాదు తనకింద వాళ్ళందరి పర్సనల్ ఫైల్స్ ఖరాబు చేసి పెట్టాడు. అయినా అందరిమీదా కోపం, తనమీద తనకే అసహనం, అందర్నీ దుర్మార్గులుగా తన మంచితనం తనని కబళిస్తున్నట్లుగా ఫీలవుతూ.

"నన్ను నేను మర్చిపోవడానికి" అంటూ తాగడం మొదలు పెట్టాడు. అతనికి మొదలు పెట్టడం అయితే తెలిసింది కానీ ఆపడం తెలియదు. ఉక్రోషం, సమాజం మీదకసీ తాగిన మత్తులో నేకెడ్‌గా బయటపడేవి. పోనీ దాని వలన మనసేమైనా తేలికపడిందా అంటే అదేం లేదు. జారుడు బండమీద బేలన్స్ ఏమిటి.

ఆఫీసుల్లో ఇబ్బందుల్నించి భారంగా కోపంగా ఇంటికొస్తే అక్కడ పిల్లలు "మీవాడు మా టైంపీస్ పగలగొట్టాడు" పక్కింటి పరంధామయ్య పెళ్ళాం గొడవకు సిద్ధంగా.

"మీవాడు మా ఇంట్లో డబ్బులు తీశాడండీ, నాలుగు తగిలిద్దాం అనుకున్నాను. కానీ మీరేమైనా అదుపులో పెట్టుకోగలరేమో మీకు చెప్పి చూద్దామనీ" మరో కుటుంబరావు కంప్లయింట్.

ఒళ్లుతెలియని కోపంతో, కుర్రాడ్ని కొట్టేమందలిస్తామంటే.

"మీ తాగుడు కాకుండా మీకు వాడి సంగతి కూడా పట్టిందీ" భార్యసాదింపు.

పెళ్ళాం పిల్లలు శత్రువుల్లా కనిపించడం మొదలు పెట్టారు. ఎవ్వర్నీ ప్రేమించలేదు. చివరికి తన్నుతాను చూడా. దుర్మార్గంగా మారిపోవాలనుకుంటాడు. తన దుర్మార్గాన్ని గుర్తించలేదు.

హింసంటే రక్తమే అతనికి, కానీ తను చేస్తున్న హింస అతనికి తెలియదు.

స్వేచ్ఛగా బయట తిరగలేడు సందులూ గొందులే అతని రహదారి.

దారిపొడుగునా అప్పుల వాళ్ళు భూతాల రూపంతో పొంచి ఉన్నట్లనిపించేవారు.

స్వల్పకాలంలో తన నీడే తనకు కాలనాగులా కన్పించడం మొదలెట్టింది. భార్యనే యజమానిగా ఒప్పుకుందామంటే అహం. అంతేకాదు అసలెవరూ అతనికి కావలసిన వాళ్ళుగా కనిపించలేదు. తనే తనకొక అవాంఛనీయ వ్యక్తి అయిపోయాడు.

ప్రతీక్షణం చచ్చిపోదామనే ఆలోచన, కనిపించిన ప్రతీవాడితోనూ తన చావునిగురించే సంభాషణ. విపరీతమైన పిరికితనం! చావడం అంత తేలికేం కాదు! ఉద్యోగం నుంచి, సాధించే భార్యనుంచి ప్రేమించలేని కొడుకునుంచి, చివరికి తనకక్కరలేని తననుంచి కూడా పారిపోయాడు.

ఈ జనసమూహంలో తొలిరోజుల్లో మనకత్యంత ఆత్మీయుడైన సుబ్బారావుని, మనం ప్రేమించగలిగిన సుబ్బారావుని, సుబ్బారావు కోల్పోయిన సుబ్బారావుని మనం వెతుక్కుందాం. ప్లీజ్ రండి అందరం కలిసి ఆ సుబ్బారావుని వెతికి పట్టుకుందాం మనం కూడా సుబ్బారావులం కాకముందే!